కావలసినవి: పనీర్- 200 గ్రా, చీజ్- 100 గ్రా, ఉప్పు- రుచికి తగినంత, బంగాళదుంపలు- రెండు, మొక్కజొన్న పిండి- మూడు టేబుల్ స్పూన్లు, బ్రెడ్ పౌడర్- అర కప్పు, పచ్చిమిర్చి- రెండు, కొత్తిమీర తరుగు- గుప్పెడు, అల్లం తురుము- స్పూన్, చాట్ మసాలా, కారం, మిరియాల పొడి, గరం మసాలా- అర స్పూన్ చొప్పున, నూనె- వేయించడానికి సరిపడా

తయారీ: ముందుగా పనీర్, చీజ్‌లను తురిమి సిద్ధంగా ఉంచాలి. బంగాళదుంపలను ఉడికించి, మెత్తగా మెదపాలి. అందులో పనీర్, పచ్చిమిర్చి, కొత్తిమీర, అల్లం తురుము, చాట్ మసాలా, కారం, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, ఒక స్పూన్ మొక్కజొన్న పిండి వేసి కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న రొట్టెల్లా చేయాలి. వాటి మధ్యలో తగినంత చీజ్ ఉంచి, అంచులు మూసేసి, బంతిలా చేయాలి. మిగిలిన మొక్కజొన్న పిండిలో కొద్దిగా నీళ్లు పోసి కలపాలి. పనీర్ బాల్స్‌ను మొదట కార్న్‌ఫ్లోర్ పేస్ట్‌లో ముంచి, తర్వాత బ్రెడ్ పొడిలో దొర్లించి, ఫ్రిజ్‌లో ఉంచాలి. పావుగంట తర్వాత కాగుతున్న నూనెలో వేయిస్తే సరిపోతుంది.

పనీర్ చమ్ చమ్

కావలసినవి: పనీర్- 250 గ్రా, కొబ్బరి తురుము- అర కప్పు, మైదా, రవ్వ- స్పూన్ చొప్పున, పంచదార- 2 కప్పులు, నీళ్లు- 5 కప్పులు, యాలకుల పొడి- అర స్పూన్, కుంకుమపువ్వు- కొద్దిగా, పాలు- 2 టేబుల్ స్పూన్లు, పిస్తా, బాదంపప్పు పలుకులు- 2 టేబుల్ స్పూన్ల చొప్పున

తయారీ: గోరువెచ్చని పాలలో కుంకుమపువ్వు వేసి నానబెట్టాలి. పనీర్‌ను తుంచి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో మైదా, రవ్వ వేసి మళ్లీ మళ్లీ కలిపి.. మెత్తగా అయ్యాక.. కోలగా ఆకృతులు చేయాలి. వెడల్పాటి గిన్నెలో పంచదార, కొన్ని నీళ్లు, యాలకుల పొడి వేసి మరిగించాలి. ఈ పాకంలో పనీర్ చమ్ చమ్‌లు వేసి ఉడికించాలి. పావుగంట తర్వాత కుంకుమపువ్వు కలిపిన పాలు జతచేయాలి. మరో ఐదు నిమిషాలు ఉడికించి, సెగ తీసేయాలి. ఒక గంట అలా ఉంచితే.. పాకాన్ని పీల్చుకుంటాయి. ఇప్పుడు పాకం లోంచి తీసి.. కొబ్బరి తురుములో దొర్లించాలి. పైన సన్నగా తరిగిన డ్రైఫ్రూట్స్ చల్లితే.. నోరూరించే 'పనీర్ చమ్ చమ్' సిద్ధం.

బ్యాచిలర్స్ కిచెన్

బ్రెడ్ బిర్యానీ చేసేశా!

ఆదివారం సాయంత్రం.. ఆకలి దంచేస్తోంది. బయటికెళ్లి తిందామంటే మా జేబుల్లో చిల్లర తప్ప పెద్ద నోట్లేమీ లేవు. ఫ్రిజ్ తెరిచి చూస్తే నాలుగు బ్రెడ్ ముక్కలు, కొంచెం పెరుగు ఉన్నాయంతే. 'వీటితో ఏం చేయగలంరా? ఇవాళ మనం ఆకలితో పోయేట్టే ఉన్నాం' రూమ్మేట్ పవన్ నిరాశగా అన్నాడు. 'బ్రెడ్ బజ్జీ చేద్దాం' అన్నాన్నేను. అందరి ముఖాలూ వెలిగిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిపోయా. ముందుగా శనగపిండిలో కొంచెం నీళ్లు పోసి కలిపా. బ్రెడ్‌ని ముక్కలుగా కట్ చేసి పిండిలో ముంచి, నూనెలో వేశా. అవి ఎంచక్కా వేగుతుంటే.. నా రూమ్మేట్స్ ఆనందంతో ఈలలేశారు. 'ఆకలికి ఆగలేకపోతున్నా.. రెండు నా ప్లేటులో వేసెయ్‌రా!' అన్నాడు శేఖర్. 'ఆగు.. అసలు సినిమా ఇంకా ఉంది' అని.. మరో కడాయిలో ఉల్లి, మిర్చి, టొమాటో ముక్కలు, మసాలాలు వేసి గ్రేవీ తయారుచేశా. అందులో బ్రెడ్ బజ్జీలు వేసి, కొత్తిమీర చల్లి సెగ తీసేశా. అప్పటికే పవన్, శేఖర్ ప్లేట్లు పట్టుకొని రెడీగా ఉన్నారు. వేయగానే ఆబగా తిని.. 'టేస్ట్ అదిరిపోయిందిరా' అన్నారు. నా ఛాతీ ఉప్పొంగిపోయింది, నవ్వి కాలరెగరేశా. 'ఒరేయ్ షెఫ్పూ! నిన్నటి లాంటిదే మళ్లీ చేసిపెట్టరా' అంటూ మర్నాడు తయారయ్యారు. ఈసారి రెట్టించిన ఉత్సాహంతో.. మరింత వెరైటీగా బ్రెడ్‌తో బిర్యానీ చేశా. ఇక మావాళ్లు.. నన్ను పొగడ్తలతో ముంచేయడమే కాదు.. కాలేజీలోనూ నా గురించి గొప్పలు చెప్పారు. వాళ్లు నాకు 'బ్యాచిలర్ షెఫ్' అని బిరుదిచ్చేసి, మా రూమ్‌ని చాట్‌భండార్‌గా మార్చేశారు.

– కమలాకర్, కరీంనగర్

పాకక వంట

సాయంత్రం వేళ వేడివేడి చిరుతిండి కావాలనిపిస్తుంది. అందుకోసం.. తరచూ తినే ఆలూ బజ్జీ, ఉల్లి పకోడీ లాంటివి కాకుండా కొంచెం భిన్నంగా ఉండాలంటే.. 'చామాకు వడలు' చేసేయండి. ఇవెంతో రుచిగా ఉండి, అందరికీ నచ్చేస్తాయి.

నోరూరించే చామాకు వడలు

పాకక వంట

కావలసినవి: చామాకులు- 6, శనగపిండి- కప్పు, బియ్యప్పిండి- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్ర, ధనియాల పొడులు- స్పూన్ చొప్పున, నువ్వులు- 2 స్పూన్లు, ఇంగువ- చిటికెడు, నూనె- వేయించడానికి సరిపడా

తయారీ: చామాకులను కడిగి, తొడిమెలు తీసేయాలి. వెనుక భాగంలో ఎత్తుగా కనిపిస్తున్న మధ్యలోని ఈనెను చాకుతో కోసి.. చదునుగా ఉండేట్లు చేయాలి. ఆకులు మరీ పెద్దగా ఉంటే సగానికి తుంచాలి. శనగపిండిలో బియ్యప్పిండి, ఉప్పు, వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్ర, ధనియాల పొడులు, ఇంగువ వేసి.. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండి కలపాలి. పిండి గట్టిగా ఉండాలి. వెడల్పాటి పళ్లెంలో చామాకును ఉంచి.. తగినంత పిండిని సమంగా పూసి, నువ్వులు చల్లాలి. దాని మీద మరో ఆకు ఉంచి అలాగే చేయాలి. అలా ఒకదాని మీద ఒకటి చొప్పున అన్నీ అయ్యాక.. గట్టిగా చాపలా చుట్టాలి. ఈ రోల్స్‌ను సుమారు పావుగంట సేపు ఆవిరి మీద ఉడికించాలి. చల్లారాక.. ముక్కలుగా కట్‌చేసి.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అంతే.. నోరూరించే చిరుతిండి తయారైపోతుంది.

– సంగీతా మైస్కర్, హైదరాబాద్

గుడ్డు, చికెన్ కలయికతో తయారయ్యే ప్రొటీన్ చిప్స్ ఎంతో రుచిగా ఉంటాయి. సాధారణ పెనంపైనే సులువుగా, వేగంగా వీటిని చేసుకోవచ్చు. కరకరలాడే స్నాక్స్ ఇష్టపడేవారికి ఇది బెస్ట్ ఛాయిస్!

ఇంట్లోనే చికెన్ ప్రొటీన్ చిప్స్

షెఫ్ స్పెషల్

కావలసినవి: చికెన్ బ్రెస్ట్ పీస్- 300 గ్రా, గుడ్లు- 2, కారం, ఉల్లి, మిరియాల పొడులు- స్పూన్ చొప్పున, ఉప్పు- తగినంత, ఆలివ్ నూనె- 2 స్పూన్లు

తయారీ: చికెన్ ముక్కలను కడిగి, తడి లేకుండా తుడవాలి. వాటిని జార్‌లో వేసి.. గుడ్డుసొన, కారం, ఉప్పు, ఉల్లి, మిరియాల పొడులు జతచేసి మెత్తటి పేస్ట్‌లా అయ్యే వరకూ గ్రైండ్ చేయాలి. దాన్ని పైపింగ్ బ్యాగ్‌లోకి తీసుకోవాలి. స్టవ్ మీద దోశల పెనం వేడయ్యాక.. నూనె వేసి, పెనం అంతటా పరచుకునేలా చేయాలి. ఇప్పుడు చికెన్ మిశ్రమాన్ని సన్నగా, బలపాల్లా ఒత్తుకోవాలి. అంటే.. అవి చూడటానికి కుర్‌కురే స్టిక్స్‌లా ఉండాలి. మందంగా ఉంటే.. సరిగ్గా ఉడకవు, లోపల పచ్చిగా ఉంటుంది. కాబట్టి వీలైనంత సన్నగా ఒత్తుకోవాలి. వాటిని తక్కువ సెగ మీద అటూ ఇటూ కదిలిస్తూ.. బంగారు రంగులోకి మారే వరకూ ఉంచి, తీసేయాలి. ఇక కరకరలాడే, చికెన్ ప్రొటీన్ చిప్స్‌ను తిని ఆనందించడమే తరువాయి.

మజారే.. మటన్ కారంపొడి!

కూరలెన్ని ఉన్నా.. రోటిపచ్చడి, కారప్పొడుల స్థానం ప్రత్యేకమైంది. పల్లీకారం, నువ్వుల కారం లాంటివి కాకుండా.. మటన్ కారంపొడి ఉందనుకోండి.. మజా వస్తుంది కదూ! ఇంకెందుకాలస్యం.. చేసేయండి మరి.

కావలసినవి: బోన్‌లెస్ మటన్- పావు కిలో, ఎండుమిర్చి- 20 (కారం తక్కువ తినేవారు 2 తగ్గించవచ్చు), ధనియాలు- రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టేబుల్ స్పూన్, మిరియాలు- అర స్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 15, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు - రుచికి తగినంత, పసుపు- పావు స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: మాంసం ముక్కల్లో కొన్ని నీళ్లు, పసుపు, ఉప్పు జతచేసి కుక్కర్‌లో 5 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. ఆవిరి పోయి, మూత తీశాక ముక్కల్లో నీరుంటే.. పూర్తిగా ఇగిరిపోయే వరకూ సన్న సెగ మీదుంచాలి. ఆ ముక్కలను నూనెలో వేయించాలి. ముక్కలు బాగా వేగి, ముదురు రంగులోకి మారితేనే కారంపొడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి.. ధనియాలు, జీలకర్ర, మిరియాలు, ఎండుమిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలను దోరగా వేయించి చల్లార్చుకోవాలి. ముందుగా ధనియాలు, జీలకర్ర, మిరియాలను గ్రైండ్ చేయాలి. అందులో ఎండుమిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు చేర్చి పొడి చేయాలి. చివరగా ఉప్పు, మటన్ ముక్కలను జతచేసి, మిక్సీని ఆన్ చేస్తూ, ఆపుతూ.. కొంచెం బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. అంతే.. ఎంతో రుచిగా ఉండే మటన్ కారంపొడి తయారైపోతుంది. దీన్ని తడి లేని డబ్బాలో భద్రపరిస్తే.. రెండు వారాలు నిల్వ ఉంటుంది.

– వెంకటలక్ష్మి, హైదరాబాద్

పిఠాపురంలో ఆరోగ్య రంగానికి కొత్త రూపు

- రూ.34 కోట్లతో వంద పడకల ఆసుపత్రి పనులు
- ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి

ఈనాడు, అమరావతి: పిఠాపురం నియోజకవర్గాన్ని అత్యున్నత ఆరోగ్య సేవలకు నిలయంగా, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ ఆరోగ్యహబ్‌గా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీర్చిదిద్దుతున్నారని, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని ఉపముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పిఠాపురంలోని 30 పడకల సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. 4.67 ఎకరాల్లో ఆధునిక ఐసీయూ, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్, 30 పడకల ప్రసూతి విభాగం, చిన్నపిల్లల వైద్యం, ఎముకలు, కంటి వైద్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలు ఉంటాయి. పిఠాపురం పరిధి ఆరు మండలాలకు చెందిన 3 లక్షల మందికి ఈ ఆసుపత్రి ఉపయోగపడుతుంది. నేషనల్ ఆయుష్ మిషన్ కింద ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలకు రూ.100 కోట్లతో భవనం నిర్మిస్తున్నారు. కొమరగిరి, చేబ్రోలులో రూ.కోటితో పీహెచ్‌సీల నిర్మాణం పూర్తయ్యింది. కాకినాడ సర్వజన ఆస్పత్రిలో రూ.36.6 కోట్ల అంచనా వ్యయంతో అధునాతన క్యాన్సర్ చికిత్సాకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి ఏర్పాటు చేయిస్తున్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి

- దిశ ఛైర్మన్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, వేదికపై కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని దిశ కమిటీ ఛైర్మన్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ సూచించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా, పీఎంశ్రీ స్కూళ్లకు కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో ఖర్చుచేసి, విద్యార్థులకు అన్ని మౌలిక వనరులను అందుబాటులోకి తేవాలని చెప్పారు. పీఎం ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస యోజన, ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఏకరూప పంటల బీమా వర్తించేలా ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, కాకినాడ పరిసరాల్లో పారిశ్రామిక వనరుల కల్పన, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణలో జాప్యంపై ఎంపీ ఆగ్రహం

కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.72.42 కోట్లు కేటాయించి మూడు నెలలు గడుస్తున్నా పనులు ఎందుకు ప్రారంభించలేదని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మారిటైమ్ బోర్డు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ టెండర్లు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈపనుల్లో జాప్యం వెనుక ప్రైవేటు పోర్టు ప్రయోజనాలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పనులు చేపడతారో లేదో వారంలోగా చెప్పాలన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర పథకాలు గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఎల్‌నినోపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు.

రైల్వే వంతెన నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో రైల్వే వంతెన(ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. భారత ప్రభుత్వం రైల్వే మంత్రిత్వశాఖ నోటిఫికేషన్‌ను ఈ నెల 27న విడుదల చేసింది. గొల్లప్రోలు యార్డ్‌లో లెవెల్ క్రాసింగ్ నంబర్ 433 స్థానంలో వంతెన నిర్మాణానికి భూమిని సేకరించే ఉద్దేశంతో చీఫ్ ఇంజినీర్ కె.సూర్యనారాయణ నోటిఫికేషన్ ఇచ్చారు. సూరంపేట వాసులు, రైల్వేట్రాక్ అవతలివైపునున్న పంట పొలాల రైతులకు దారికోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. 25 మంది రైతులు, ప్రభుత్వానికి చెందిన 5.705 ఎకరాల భూమిని సేకరించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం రైతులతో గతంలో రెండు విడతలు రైల్వే, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమావేశం నిర్వహించారు.

ఏఈ నూకరాజు ఆత్మహత్య బాధాకరం

నివాళి అర్పిస్తున్న అధికారులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు ఆత్మహత్య బాధాకరమని డీఈ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పిఠాపురం పీఆర్ కార్యాలయంలో నూకరాజు దంపతుల సంతాప సభ నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళి అర్పించారు. డీఈ మాట్లాడుతూ 15 ఏళ్లుగా పిఠాపురంలోనే పనిచేశారని, అందరికీ ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు వృత్తిపరంగా చక్కటి శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వసంతమాధవి, ఏఈలు, జేఈలు, గుత్తేదారులు బాబు, భాస్కరరమేష్, శ్రీనివాసరావు, కృష్ణవేణి, వీరబాబు, కృష్ణమోహన్, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా విషాదం

తమ్ముడు మృతి, అన్నయ్యకు తీవ్ర గాయాలు

సోదరుడు నవీన్ (పాత చిత్రం) (వృత్తంలో మృతుడు శివప్రసాద్)

గండేపల్లి, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదమ్ములిద్దరూ వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఏడు వారాల మొక్కు (5వ వారం పూజ) తీర్చుకునే క్రమంలో శనివారం ఉదయం వేకువజామున ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి బయలుదేరి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా టిప్పర్ ఢీ కొట్టిన ప్రమాదంలో తమ్ముడు మృతి చెందగా, అన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబీకులు, గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలోని ఎ.వీరనారాయణం పంచాయతీ కాగిత గ్రామానికి చెందిన రొబ్బా రమణ, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కొడుకు నవీన్ దివ్యాంగుడు. రెండో కుమారుడు శివప్రసాద్ (22), కుమార్తె లలిత ఉన్నారు. నవీన్ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటుండగా.. శివప్రసాద్ డిప్లొమా, లలిత ఇంటర్ చదువు పూర్తి చేశారు. నవీన్, తమ్ముడు శివప్రసాద్(22) ద్విచక్రవాహనంపై వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామంలోని బరోడా బ్యాంకు ఎదురుగా వచ్చే సరికి టిప్పర్ బలంగా ఢీ కొట్టింది. ప్రసాద్‌పై నుంచి లారీ ఎక్కగా, నవీన్‌ను కొంతదూరం ఈడ్చుకుపోయింది. ఈప్రమాదంలో శివప్రసాద్ (22) అక్కడికక్కడే మృతి చెందగా, నవీన్ చేయి నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర గాయాలైన నవీన్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతుడు ప్రసాద్‌ను జడ్.రాగంపేట సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లలితకు ఇటీవల నిశ్చితార్థం కావడంతో అందరూ ఎంతో సంతోషంగా ఉన్న సమయంలో ఈ ఘటన జరగడంతో కుటుంబీకులు బోరున విలపించారు. దీంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి.

కేసుల్లో ఆధారాలను పకడ్బందీగా సేకరించాలి: ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి ఆధారాలను పకబ్బందీగా సేకరించి నేరస్థులకు చట్టపరంగా శిక్షలు పడేలా విధంగా దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ బిందుమాధవ్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిందితుల అరెస్ట్, దొంగతనం కేసుల ఛేదన, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ తదితర అంశాలపై ఎస్పీ, అధికారులతో సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎస్పీ డా.మహంతి కిషోర్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ తిలక్, ఎస్బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

మాట్లాడుతున్న సంఘ జాతీయ అధ్యక్షుడు భాస్కర్

పెద్దాపురం, న్యూస్‌టుడే: యువ విప్లవకారుల పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. పెద్దాపురం తాడితోటలోని తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో శనివారం పీవైఎల్ 7వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ నిరుద్యోగం, పేదరికం, అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందన్నారు. నీట్ నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి పరిణామాలతో విద్యార్థులను నష్టపరిచారని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కార్యవర్గ సభ్యురాలు టాన్యా, భీమశంకరం, అనసూయ, నాగరాజు, కిరణ్‌కుమార్, రాజారెడ్డి, శాంతి, కమాల్‌బాషా, నాగరాజు తదితరులు ప్రసంగించారు. అంతకుముందు జెండాను ఎగురవేశారు. అరుణోదయ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

విధులకు హాజరుకాని ఉపాధ్యాయుడిపై వేటు

పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలం పోతులూరు ఎంపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(హిందీ)గా పనిచేసే మహేశ్వర్ల వీరబ్రహ్మం 2025 జూన్ 15న రిలీవ్ అయ్యారు. ఆ తరువాత పిఠాపురం మండలం విరవ జిల్లా పరిషత్ పాఠశాలలో విధుల్లో చేరారు. ఆ మరుసటి రోజు నుంచి విధులకు హాజరుకాలేదు. దాంతో వీరబ్రహ్మంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఉత్తర్వులను శనివారం జారీచేశారని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు, ఎంఈవో పాదాలు తెలిపారు. రిలీవర్ లేని కారణంగా తిరిగి ఎంపీయూపీ స్కూల్, పోతులూరులో 2025 జులై 1 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు రకరకాల కారణాతో మెడికల్ లీవ్ పెట్టి విధులకు హాజరుకావడం లేదని తెలిపారు. మే 1 నుంచి ఏ రకమైన లీవ్‌లు పెట్టలేదని, ఫోన్‌లో కూడా సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

అదరగొట్టారు.. ఛాంపియన్లుగా నిలిచారు

హాకీ అండర్-23 మహిళా విభాగంలో మొదటి స్థానం సాధించిన కాకినాడ జట్టు

ఖోఖో అండర్-23 మహిళా విభాగం మొదటి స్థానం సాధించిన కాకినాడ జట్టు

ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, తిరుపతి క్రీడలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. శనివారం కబడ్డీ, హాకీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడల ఫైనల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు బహుమతులు అందజేశారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్	ఉ॥ 7 - ఉ॥ 9
రాశివాసి	ఉ॥ 9 - ఉ॥ 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ॥ 10 - మ॥ 2
ఈవారం అతిథి	మ॥ 2 - సా॥ 5
టెస్ట్ డ్రైవ్	సా॥ 5 - సా॥ 7
హ్యాష్ ట్యాగ్	సా॥ 7 - రా॥ 9
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 9 - ఉ॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

కాకినాడ

ప్రత్యేక శిబిరాలకు స్పందన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1,822 పోలింగ్ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు స్పందన లభించింది. కొత్తగా ఓటు నమోదుకు 1,809, తొలగింపునకు 7, చేర్పులు, మార్పులు, బదిలీకి 728 దరఖాస్తులు అందాయి. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలు శిబిరాలను పరిశీలించారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మసీదుసెంటర్, జగన్నాథపురం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఎలైట్ అధ్యక్షుడు లంకె లెనిన్ ఆర్థిక సహకారంతో స్థానిక ముత్తానగర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యలు, పరిష్కారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. క్లబ్ కార్యదర్శి తుమ్మలపల్లి నారాయణరావు, కోశాధికారి సునీల్, హైస్కూల్ హెచ్‌ఎం కేవీవీ ప్రసాద్, కర్రి రాజా భాస్కర్‌రెడ్డి, డా.మంజీరా దాలే, శిరీష, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రండి: ఎస్పీ

శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఒక యూనిట్ రక్తదానం చేయడం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, అందరూ దీనిపై అవగాహన పెంచుకుని, ముందుకు రావాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. త్వరలో జరిగే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (ఏక్తా దివస్) సందర్భంగా కాకినాడ పోలీసు కల్యాణ మండపం వద్ద ప్రత్యేక శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రోటరీ క్లబ్, యువసేన, జీజీహెచ్ రక్తనిధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక యువత కలిపి 111 మంది రక్తదానం చేశారు. ఏఎస్పీ డా.మహంతి కిషోర్‌కుమార్, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

నీరుగారిన నిర్వహణ

మూతపడిన ఎన్టీఆర్ సుజల ప్లాంట్లు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో గతంలో ఎన్టీఆర్ సుజల(ఆర్వో) ప్లాంట్లను ఏర్పాటు చేశారు. దాతలను ప్రోత్సహించి 20 లీటర్ల శుద్ధి నీటిని రూ.2కే ఇవ్వాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్లను నెలకొల్పారు. ప్రారంభంలో బాగా పనిచేశాయి. తర్వాత నిర్వహణ లేక నిర్లక్ష్యంతో మూతపడ్డాయి. వీటి కోసం కేటాయించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. అందులోని పరికరాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

పట్టించుకోని అధికారులు

ఓఎన్జీసీ, రిలయన్స్, సీపోర్టు తదితర సంస్థల తోడ్పాటుతో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసిన తరువాత నిర్వహణ బాధ్యతను స్థానిక పరిపాలనా సంస్థలకే అప్పగించారు. నగరపాలక సంస్థ వసతులు సమకూర్చడంతో నగరంలోని జెడ్పీ కార్యాలయం, రాగంపేట, రేచర్లపేట, గొడారిగుంట, వార్పు రోడ్డు, మాటీ సెంటర్, జె.రామారావుపేటలో ఏర్పాటు చేశారు. నీటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులతో విద్యుత్తు బిల్లులు చెల్లించేవారు. తరువాత వీటి నిర్వహణ గాలికొదిలేయడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. కొందరు ఆకతాయిలు మద్యం తాగుతూ, సీసాలు అక్కడే వదిలేస్తున్నారు.

గొడారిగుంటలో నిరుపయోగంగా ఎన్టీఆర్ సుజల ప్లాంటు

ఎంతో అవసరం..

వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం వేసవిని తలపిస్తోంది. వర్షాలు కురవకపోవడం, మున్సిపల్ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఈ ప్లాంట్లు ప్రజలకు ఎంతో ఉపయోగపడేవి. ప్రస్తుతం అవి లేకపోవడంతో ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. వారు కూడా ధరలు పెంచేశారు. గతంలో 20 లీటర్ల నీటి ధర రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.15కు విక్రయిస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి..

గతంలో ఏర్పాటు చేసిన ఈ సుజల ప్లాంట్లు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. తక్కువ ధరకే శుద్ధిచేసిన నీరు అందుతుండటంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు వారి వేసవిలో ఆసరాగా ఉండేవి. ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. నగరపాలక అధికారులు స్పందించి ఈ ప్లాంట్లను తెరిపించి వినియోగంలోకి తేవాలి.

-రవీంద్ర, రేచర్లపేట

బీఎల్వోలకు నోటీసులు జారీ

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: విధుల పట్ల అలసత్వం వహించిన పలువురు బీఎల్వోలకు ఈఆర్వో కేటీ సుధాకర్ నోటీసులు జారీచేశారు. 48వ బూత్ రేణుక దేవి(మహిళా సంరక్షణ), 167 బూత్ బీఎల్వో లలిత విష్ణుప్రియ గాంధీ(మహిళా సంరక్షణ), 242 బూత్ బీఎల్వో అమ్మాజీ(ప్లానింగ్ సెక్రటరీ)లకు సంజాయిషీ నోటీసులు ఇచ్చారు.

10 మంది సచివాలయ అడ్మిన్లకు..

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో సర్వేలో సచివాలయాల్లో పనిచేస్తున్న 10 మంది వార్డు అడ్మిన్లు, ఇన్‌ఛార్జి అడ్మిన్లకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ఆస్తిపన్నుల వసూళ్లకు సంబంధించి కమిషనర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి 10 మందికిపైగా గైర్హాజరయ్యారు. దీనిపై కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ ఈ నోటీసులు జారీ చేశారు.

ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించుకోవాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ) ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో పారిశ్రామిక వేత్తలు ఏఐ సాంకేతికతలను వినియోగించుకోవాలని ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సూచించారు. శనివారం కాకినాడ వెంకీ రెసిడెన్సీలో నిర్వహించిన ప్రత్యేక జేసీఓఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఏఐ, యువ వ్యాపారులకు ప్రభుత్వ సహకారం, ఉపాధి కల్పనతోపాటు కాకినాడ, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవకాశాలపై చర్చించారు. జేసీఓఎం కాకినాడ 2.0 ఛైర్మన్ చిట్టూరి రత్న గీతార్థ, మెడికవర్ హాస్పటల్ సీఈవో అంజిబాబు, కోచ్ రామ్‌సుబ్బారావు, శ్రీ సొల్యూషన్, డైల్ షోరూమ్ డైరెక్టర్ కోడూరి వీరరామచంద్రమూర్తి, జనసేన నాయకులు మహమ్మద్ హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పరిపాలన చట్టంపై అవగాహన

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా భారతి ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు డా.కె.పద్మనాభం అధ్యక్షతన జాతీయ క్రీడా పరిపాలన చట్టం-2025పై అవగాహన సదస్సును కాకినాడలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీలు పద్మశ్రీ, కుడిపూడి సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా భారతి జోనల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రాష్ట్ర క్రీడా భారతి ఛైర్మన్ మాణిక్యాలు తదితరులు పాల్గొన్నారు. తొలుత ధ్యాన్‌చంద్, చిరంజీవిని కుమారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరప్రసాద్, పున్నయ్య చౌదరి, ముత్తా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీకి చిరంజీవిని కుమారిని నామినేట్ చేస్తాం: ఎంపీ

ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌ను సత్కరించిన కళాశాల యాజమాన్యం

మసీదుసెంటర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి వర్గాల విద్యావికాసానికి చిరంజీవిని కుమారి విశేష కృషి చేశారని, తెలుగు భాష పరిరక్షణకు పాటుపడ్డారని.. ఆమె పేరును పద్మశ్రీకి నామినేట్ చేస్తానని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో డా.పి.చిరంజీవిని కుమారి స్మారక తెలుగు భాషా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చిరంజీవిని కుమారి జిల్లా సాంఘిక చరిత్ర, పుస్తకాల్ని రచించి జిల్లా చరిత్రను సజీవంగా ఉంచారన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో ఆమె విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కిరణ్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు అకడమిక్ డైరెక్టర్ రంజిత్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వాసు, ప్రిన్సిపల్ డా.సత్యనారాయణ, పోటీల కన్వీనర్ కిరణ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను మెరుగుపర్చాలని వినతి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్)లో వైద్యసేవలను మెరుగుపర్చాలని సీపీఎం నగర కమిటీ కోరింది. దీనిపై శనివారం కలెక్టరేట్‌లో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. పడకల స్థాయిని 2,500కు పెంచాలని, టీబీ బ్లాక్ ప్రాంగణంలో నూతన ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని, సామర్థ్యం మేరకు వీల్ ఛైర్లు, స్ట్రెచర్లు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టును నియమించాలని విజ్ఞప్తి చేశారు.

కాలినడక వంతెన ఏర్పాటు చేయరూ..

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: నగరంఓలని 32వ డివిజన్ రామకృష్ణారావుపేట రామయ్య వీధి చివర నుంచి రేచర్లపేట ఒకటో వీధిని కలుపుతూ రైల్వే ట్రాక్ మీదుగా కాలినడక వంతెన ఏర్పాటు చేయాలని ఎంపీజే ప్రతినిధులు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు శనివారం విజ్ఞాపన పత్రం అందజేశారు. ముందుగా శాలువా కప్పి మెమోంటోతో సత్కరించారు. ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఎండీ హలీమ్, సభ్యులు ఎండీ ఉస్మాన్ షబ్బీర్, ఫరూక్ అలీ, మహబూబ్‌అలీ, అబ్బాస్, రహ్మతుల్లా, షాజహాన్ ఉన్నారు.

వాత్సల్య పథకాన్ని వినియోగించుకోండి

మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న వాత్సల్య పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు సూచించారు. శనివారం కాకినాడ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో వాత్సల్య పథకం లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వారి స్థితిగతులు, పథకాన్ని ఏ విధంగా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అర్బన్ ఇన్‌ఛార్జి సీడీపీవో జి.ఉష మాట్లాడుతూ పథకం ద్వారా 74 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. కమిటీ మెంబర్ పి.వెంకట్రావు, పరిరక్షణ విభాగం అధికారి కె.శ్రీనివాస్, జె.విజయ, చిన్నబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు

కాకినాడ ఏడో డివిజన్ పరిధిలోని రేచర్లపేట అంబేడ్కర్ గ్లోబ్ వద్ద మ్యాన్‌హోల్‌పై మూత లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా కాలువలోకి పడే అవకాశముంది. చిన్నారులు, వృద్ధులు తిరుగుతుంటారని, ప్రమాదం జరగకముందే నగరపాలక అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై ఇనుప చట్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

రహదారి చెంతన చెత్త..

కాకినాడ జగన్నాథపురం, కొత్త వంతెన కింద రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. గతకొన్ని రోజులుగా సిబ్బంది తొలగించకుండా వదిలేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

రాకపోకలకు ఇబ్బందులు..

కాకినాడ ఏడో డివిజన్ పరిధిలోని పోస్టల్ కాలనీ నుంచి లక్ష్మీనారాయణ నగర్‌కు వెళ్లే దారిలో అడ్డుగా ఇసుక, కంకర వేసి వదిలేశారు. దీంతో రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇసుకతో వాహనాలు జారి అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తిచేస్తున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

తీగలకు అల్లుకున్న పొదలు

కాకినాడ, జగన్నాథపురం, నరసింహరోడ్డు, చేపలమార్కెట్ పక్క వీధిలో ఓ విద్యుత్తు స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో గాలికి నిప్పురవ్వలు వస్తున్నాయని, తరచూ సరఫరా ఆగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న శాప్ డిప్యూటీ డైరెక్టర్ రమణ, డీఎస్‌డీవో వి.సతీష్‌కుమార్

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: క్రీడాకారులంతా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశం తరపున ప్రాతినిధ్యం వహించాలని శాప్ డిప్యూటీ డైరెక్టర్ రమణ, డీఎస్‌డీవో వి.సతీష్ కుమార్ అన్నారు. శనివారం డీఎస్‌ఏలో జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు నిర్వహణలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరిపారు. డీఎస్‌ఏలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాకీ సంఘ ప్రతినిధి బాబ్జి, విజయ్‌కుమార్, పీడీలు లంక రవికుమార్, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంబమూర్తినగర్(కాకినాడ), గాంధీనగర్: చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్‌కుమార్ అన్నారు. అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం శనివారం నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పతకాలు అందజేశారు. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి, ఇన్‌ఛార్జి పీడీ డా.యమున, వైస్ ప్రిన్సిపల్ వై.సీతామహాలక్ష్మి, డా.జి.అనిత, ఎం.శివకుమారి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు క్రాంతి, చిన్నారి, జయలక్ష్మి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

● జేఎన్‌టీయూకే లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంతో క్రీడలు, శారీరక వ్యాయామం ఎంతో ముఖ్యమైనవన్నారు. ప్రిన్సిపల్ ప్రొ.కె.పద్మరాజు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ట్రైనర్ సురేష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు జుంబా డ్యాన్స్ చేశారు.

జగన్నాథపురం(కాకినాడ): తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.గిరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాయామ విద్య కార్యదర్శి వి.మాచారావు, పి.డి.లు రామకృష్ణ, హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి బాటలు వేసిన గిడుగు

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: వ్యవహారిక భాషగా తెలుగుకు గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి బాటలు వేశారని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రోడ్లు, భవనాల శాఖ విశ్రాంత ఇంజినీర్, ప్రముఖ కవయిత్రి పద్మజావాణి పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులకు సాహితీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డా.వై.సీతామహాలక్ష్మి, డా.కె.శ్యామలాదేవి, డా.పి.నాగమల్లిక, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

శశికాంత్‌నగర్ భాష్యం పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

సాంబమూర్తినగర్(కాకినాడ): తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని కాకినాడ భాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు అన్నారు. నగరంలోని విద్యుత్తునగర్, శాంతినగర్, శశికాంత్‌నగర్‌తోపాటు బ్లూమ్స్ సీబీఎస్‌ఈ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

✦ ఆదిత్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అకడమిక్ డైరెక్టర్ డా.బీఈవీఎల్ నాయుడు, తేజేశ్వరరావు, ఇ.శారదకుమారి, వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

✦ పరదేశిపేట పాఠశాలలో కవి, విమర్శకుడు మాకినీడి సూర్యభాస్కర్ పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, కాకినాడ వారి కోర్టులో

I.P. No.37/2026

Between

M/s.శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కాకినాడ బ్రాంచ్ తరఫున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ – కుందరపు వెంకట రమణ ...**Petitioner**

మరియు

1. **అన్నాబత్తుల లక్ష్మి, W/o.** నాగ వీర దుర్గాప్రసాద్, వయస్సు: 33, డోర్ నెం. 17-2-59/289, మూడవ వీధి, సంజయ్ నగర్, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా
2. **అన్నాబత్తుల నాగ వీర దుర్గాప్రసాద్, S/o.** వెంకన్న, వయస్సు: 36, డోర్ నెం. 17-2-59/289, మూడవ వీధి, సంజయ్ నగర్, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా
3. **మల్లిడి కాసులమ్మ, W/o.** ఆదిరెడ్డి, వయస్సు: 37, డోర్ నెం. 17-2-59/288, సంజయ్ నగర్, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా.
4. **మొయ్య మహేష్, S/o.** కాంతారావు, వయస్సు: 42, డోర్ నెం. 17-7-29, సంజయ్ నగర్, కాకినాడ, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా
5. **అనిమిరెడ్డి రమణమ్మ, W/o.** సత్యనారాయణ, వయస్సు: 50, డోర్ నెం. 17-10-342/263, హనుమాన్ నగర్, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా

...**Respondents**

వాయిదా: ది.**11-09-2026**

ఈ నెంబరు IP లో 1 వ రెస్పాండెంట్ పిటీషనరు కంపెనీకి బాకీ ఎగవేయు దురుద్దేశ్యంతో తమకు గల ఆస్తిని 5వ రెస్పాండెంట్ పేరున సృష్టించిన లాలూచీ దస్తావేజును రద్దుచేయమని పిటీషనరు వారు దాఖలు చేసిన IPలో 5వ రెస్పాండెంట్ అయిన మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్న యెడల ది.**11-09-2026**వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10.30 ని॥లకు మీరు స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు:

పూర్వం తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, వార్డ్ నెం.2రు, రెవెన్యూ వార్డు నెం.11రు, బ్లాక్ నెం.17రు, టి.యస్.నెం.133/పి రు తాలూకు కాకినాడ సిటీ, సంజయ్ నగర్ ఏరియాలో గల స్థలముగా విభజించిన ఎల్.పి.నెం.122/98రు తాలూకు ప్లాట్ నెం.838రు తాలూకు వదరపు గజాలు 50 లు లేక 41.80 చదరపు మీటర్ల స్థలం అందుట ఎసెస్‌మెంట్ నెంబర్ 1060051605రు డోర్ నెం.17-2-59/289రు గల గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి., ఫస్ట్ ఫ్లోర్ ఎ.సి.సి. రేకుల షెడ్ గల మేడ భవంతి హద్దులు, కొలతలు వివరం.

తూర్పు: అ॥ 15.0 అ॥లు లేక 4.57 మీ॥ నప్పల పద్మావతి గారి తాలూకా ప్లాట్ నెం.819రు స్థలం అందుల డాబా ఇల్లు **పడమర:** అ॥ 15.0 అ॥లు లేక 4.57 మీ॥ రోడ్డు **ఉత్తరం:** అ॥ 30.0 అ॥లు లేక 9.14 మీ॥ మల్లిడి కాసులమ్మ గారి తాలూకు ప్లాట్ నెం.839రు స్థలం అందుల డాబా ఇల్లు **దక్షిణం:** అ॥ 30.0 అ॥లు లేక 9.14 మీ॥ మాపూరి వేణు గారి తాలూకు ప్లాట్ నెం.837రు స్థలం అందుల డాబా ఇల్లు

సదరు హద్దులు, కొలతలు మధ్యస్థమైన చ॥గ॥ 50 లు లేక 41.80 చ॥మీ॥లు స్థలం, అందుల గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి., ఫస్ట్ ఫ్లోర్ ఎ.సి.సి.రేకుల షెడ్ గల మేడ భవంతి, పై కప్పు, తలుపులు, ద్వార బంధములు, యావత్తు ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, మీటర్లు, డిపాజిట్లు, ఎలక్ట్రికల్ సర్వీస్ కనెక్షన్, అందుల మామూలు మార్గములు, నీటి వసరులు, అందుల నాకు గల సమస్త యాజమాన్యపు హక్కులతో సర్వం సహా మీకు విక్రయించి యీ రోజుననే నేను మీకు స్వాధీనం చేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాకినాడ
ది.29-08-2026

పెదపాటి శ్రీనిబాబు, అడ్వకేట్
కచ్చేరిపేట, కాకినాడ. సెల్: 99517 19601

సుదీర్ఘ కాలం న్యాయవాదిగా రాణించడం అభినందనీయం

మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేసీ భాను

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: న్యాయవాది బొగ్గవరపు గోకుల కృష్ణ అనేక మైలురాళ్లు దాటుకుని సుదీర్ఘకాలం వృత్తిజీవితంలో విజయవంతంగా రాణించడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేసీ భాను అన్నారు. న్యాయవాద వృత్తిలో గోకులకృష్ణ 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం కాకినాడ బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జస్టిస్ కేసీ భానుతో పాటు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ బి.శేషశయనారెడ్డి, జస్టిస్ కేజీ శంకర్ హాజరయ్యారు. గోకులకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింతమంది న్యాయవాదులు తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని చెప్పారు. అనంతరం ఆయనను పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కాకినాడ జిల్లా అదనపు న్యాయమూర్తులు ఆనంది, గోవర్ధన్, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు పి.రామచంద్రరాజు, కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు

చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కేసుల దర్యాప్తులో విశేషంగా కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ బిందుమాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. వన్‌టౌన్ సీఐ మండల నాగదుర్గారావు, కోర్టు హెచ్‌సీ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ పి.చంద్రశేఖర్ తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

రోడ్ల విస్తరణ, నిర్మాణానికి కార్యాచరణ

మసీదుసెంటర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రోడ్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. కాకినాడ స్మార్ట్‌సిటీ కార్యాలయంలో నగర అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అనేక రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారులకు అనుసంధానించే మార్గాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై దృష్టిపెడతామని పేర్కొన్నారు. పార్కుల అభివృద్ధిపైనా సమావేశంలో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, అదనపు కమిషనర్ సుధాకర్, ఈఈలు మాచిరాజు, కనకరావు, డీసీపీ కృష్ణారావు, ఎంహెచ్‌వో డా.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదాం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో 'స్వచ్ఛ నగరం'గా తీర్చిదిద్దుదామని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఆల్ ఈజ్‌వెల్ సంస్థకు మొక్కల సంరక్షణ కోసం స్థలం కేటాయించినందుకు డా.చిట్ల కిరణ్, డా.అడ్డాల సత్యనారాయణ, కిషోర్, ఇతర సభ్యులు శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. డా.రాజకుమార్, టీవీవీఎస్ ఎస్ రెడ్డి, డా.రవివర్మ, విక్రమ్, రాజేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ చుట్టూ అనధికార బడ్డీలు తొలగించండి

వివిధ అంశాలపై చర్చిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు. హాజరైన వైద్యాధికారులు హెచ్‌డీఎస్ సభ్యులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్) చుట్టూ అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు(బడ్డీలు) తొలగించాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈనెల 27న 'ఈనాడు'లో 'ఆక్రమణలు.. తప్పని అగచాట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జీజీహెచ్ అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో ఈ అంశంపై కలెక్టర్ చర్చించారు. తీవ్రమైన పార్కింగ్ సమస్య నెలకొంటున్న నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార బడ్డీలను తక్షణం తొలగించాలని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత, భద్రత, పారిశుద్ధ్య, జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. రెడ్‌క్రాస్ నిధులతో చేపట్టిన క్యాన్సర్ బ్లాక్‌ను త్వరగా అందుబాటులోకి తేవాలని, పాత క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నవీకరించాలని నిర్ణయించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డీఎంహెచ్‌వో అనిత, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇవీ నిర్ణయాలు..

✦ సెక్యూరిటీ గార్డులకు నెలకు రూ.18,500 చెల్లించాల్సి ఉండగా కోత పెట్టడంపై సంబంధిత గుత్తేదారును ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ నిలదీశారు. సక్రమంగా పనిచేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని చెప్పారు. ✦ కార్డియాలజిస్టు, ఇద్దరు వైద్య సహాయకులను నియమించాలని, ఎంత ఖర్చయినా ఫరవాలేదని, ప్రజలకు హృద్రోగ సేవలు వెంటనే అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. క్యాథ్‌ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ✦ జీజీహెచ్ ఎదురుగా ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలని నిర్ణయించారు. కాకినాడ-సామర్లకోట ప్రధాన రహదారిని దాటి రోగులు, సహాయకులు ఆసుపత్రికి రావాల్సి వస్తుందని, ఈ ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి ఏర్పాటుకు నిధులు సమకూర్చాలని తీర్మానించారు. ✦ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం ఇంకా మెరుగుపడాలని, దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు సూచించారు.

(c) eenadu

'టెట్ నిబంధన రద్దు చేయండి'

కాజులూరు: టెట్ రద్దు చేయాలని కోరుతూ కాజులూరు మండలానికి చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు శనివారం ఆందోళన చేపట్టారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వి.భానుప్రకాశ్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీగా గొల్లపాలెం నుంచి కాకినాడ చేరుకున్నారు. జయప్రకాశ్, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

నగరపాలికలో గ్రామాలు కలపాల్సిందే..

రమణయ్యపేట(కరప): కాకినాడ గ్రామీణ మండలంలోని ఆరు విలీన గ్రామాలను కాకినాడ నగరపాలికలో కలపాల్సిందేనని సీపీఎం ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరాహార దీక్ష చేశారు. నాయకులు రాజా, చంద్రరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, రమణరాజు, అజయ్‌కుమార్, రామ్మోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

రమణయ్యపేట(కరప): ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. సర్పవరం జంక్షన్, రమణయ్యపేటల్లో శనివారం ఆయన వీధుల్లో పేరుకుపోయిన చెత్తను, డ్రెయినేజీలను సిబ్బందితో శుభ్రం చేయించారు. తాగునీటి నాణ్యతను పరిశీలించారు. హెల్త్ ఆఫీసర్ డా.పృథ్వీచరణ్, డీఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈలు అర్జున్, రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

నిరాశ్రయులకు చేయూత

పిఠాపురం: పిఠాపురం మండలం పి.దొంతమూరులో వంట గ్యాస్ లీకై శనివారం అగ్నిప్రమాదం జరిగింది. రాజులమ్మ, వీరబాబు, లక్ష్మి కుటుంబాలు ఉంటున్న తాటాకుల పాక దగ్ధమై సామగ్రి కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. బాధితులను జనసేన నాయకుడు పెండెం దొరబాబు పరామర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అండగా ఉంటారన్నారు. బియ్యం, నిత్యావసరాలను దొరబాబు అందజేశారు. రమణబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు ఆర్థిక సాయం

సామర్లకోట: ఆపన్నులకు సాయం అందించి పెద్దమనసు చాటుకున్నారు 'సామర్లకోట యువత' సేవాసంస్థ సభ్యులు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామానికి చెందిన దండేకర్ నవీన్ అనారోగ్యం గురించి సామాజిక మాధ్యమంలో చూసి స్పందించారు. ఆ గ్రామానికి వెళ్లి అక్కడి సర్పంచి సామ్రాజ్యం చేతుల మీదుగా అతనికి రూ.25 వేలు, అదే గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారుల చదువుకు రూ.16 వేలు అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బందికి చీరల పంపిణీ

గొల్లప్రోలు: చెందుర్తిలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ మహిళాసమాఖ్యల వీవోఏలకు తెదేపా నాయకులు శనివారం చీరలు పంపిణీ చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు బోనబోయిన శివ కొనుగోలు చేసిన చీరలను 25 మందికి అందించారు.

విద్యార్థులకు ఉత్సాహంగా పోటీలు

కొత్తపల్లి: ఉ.కొత్తపల్లి జడ్పీ పాఠశాలలో ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీటీసీ సభ్యుడు ఎల్లాజీ సహకారంతో బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 40 మంది హాకీ క్రీడాకారులకు జనసేన నాయకుడు విజయ్‌కుమార్ రూ.30 వేలతో బూట్లు, క్రీడా సామగ్రి అందించారు.

పుంత దారుల ప్రగతికి ప్రణాళిక

– న్యూస్‌టుడే, పిఠాపురం, సర్పవరం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో పుంత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పంట ఉత్పత్తుల తరలింపు, పశువుల రాకపోకలు, వ్యవసాయ పనులకు వీలుగా ఉండే ఈ మార్గాలు కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. రోడ్లు గుంతలమయంగా, రాళ్లుతేలి, కోతకుగురై దయనీయంగా మారాయి. ఆ దారుల్లో రాకపోకలకు ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదలు, వర్షాల ప్రభావానికి బాగా దెబ్బతిన్నాయి. ఏలేరు, పీబీసీ కాలువల వెంట కోతకుగురై ప్రమాదకరంగా ఉన్నాయి. మరోపక్క తుప్పలు, డొంకలతో రూపుకోల్పోయాయి. పశువులు వెళ్లేందుకు కూడా సౌకర్యంగా లేవు. పలు ప్రాంతాల్లో ఆక్రమణకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించింది. పల్లెబాట పేరుతో దారులన్నీ అభివృద్ధి చెందాయి. అదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్‌రోడ్లకు కూడా మోక్షం కలిగించేందుకు చర్యలు చేపట్టారు. పంచాయతీరాజ్, వీబీ జీరాంజీ శాఖల అధికారులు సముక్తంగా గ్రావెల్ రోడ్లపై సర్వే చేశారు. విస్తీర్ణం, అంచనాలు తయారు చేశారు.

సర్వేచేసిన గ్రావెల్ రోడ్లు ఇలా..

మండలం	పంచాయతీలు	గుర్తించినవి	రోడ్లు కి.మీ.
పిఠాపురం	24	101	115.12
గొల్లప్రోలు	10	112	131.07
కొత్తపల్లి	18	72	75.18
కాకినాడ(గ్రా)	18	38	36.92
కరప	23	108	107.18
పెద్దాపురం	23	125	137.71
సామర్లకోట	18	96	115.85

ఆన్‌లైన్‌లో జాబితా

గ్రామాల్లో గుర్తించిన గ్రావెల్ రోడ్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో ఈ రోడ్లను అభివృద్ధి చేసేవారు. వీబీ జీరాంజీ పథకం అనుసంధానంతో ఈ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. ప్రత్యేక యాప్‌తో ఇప్పుడు పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలో వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఆ రోడ్ల పొడవు, వెడల్పుల ఆధారంగా ఎంత ఖర్చవుతుందో లెక్కలు తేల్చుతున్నారు. త్వరలోనే ప్రభుత్వం ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. మరో ఏడాదిలో గుర్తించిన గ్రావెల్ రోడ్లన్నీ బాగుపడనున్నాయని ఏపీవో నాయుడు తెలిపారు.

గంగానగర్ నుంచి నరసింగపురం వెళ్లే గ్రావెల్ రోడ్డు

పిఠాపురం: దీపాలకు మరమ్మతులు

కోటగుమ్మం సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. దాంతో ముఖ్యమైన ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అంధకారం అలముకుంటోంది. పట్టణంలో నిత్యం భక్తుల రద్దీ ఉంటుందని, తక్షణం మరమ్మతులు చేయించాలని జనం కోరుతున్నారు. ఏఈ కమల్‌హాసన్ మరమ్మతులు చేయించారు.

నేడు అన్నసంతర్పణ

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ జాతర మహోత్సవాలు పరిసమాప్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని ఏసీ విజయలక్ష్మి, వంశపారంపర్య ధర్మకర్త మండలి ఛైర్మన్ శ్రీహర్ష శనివారం తెలిపారు.

ఒప్పంద ఉద్యోగుల నిరసన

తాళ్లరేవు: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తాళ్లరేవు సీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ప్రభాకర్, లక్ష్మీమాధవన్ పాల్గొన్నారు.

ఆలయానికి ఆదాయం

పెద్దాపురం: తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభస్వామిని శనివారం భక్తులు దర్శించుకున్నారు. తద్వారా రూ.1,91,131 ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కాండ్రకోటలో చోరీ

పెద్దాపురం, న్యూస్‌టుడే : కాండ్రకోటకు చెందిన పిన్నిం కొండలరావు ఇంట్లోని బీరువాలో రూ.2 లక్షల ఆభరణాలు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. శనివారం ఉదయం వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై పాపారావు పేర్కొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మహారాష్ట్ర నుంచి రాఖీ పౌర్ణమి వేడుకలకు వచ్చిన వారంతా ఇక్కడే ఉన్నారు. మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈవో సౌజన్య ఏర్పాట్లు చేశారు.

● **పిఠాపురం:** పిఠాపురం పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ముగిశాయి. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాధికారి వీరప్రతాప్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● **పెదపూడి:** సూర్యనారాయణపురంలోని ఏడువారాల వెంకన్నస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

మహాసంస్థానంలో మహారాష్ట్ర భక్తులు

సెల్ టవర్ పనుల అడ్డగింత

గొల్లప్రోలు: గొల్లప్రోలు శివారున సెల్ టవర్ ఏర్పాటు పనులను దేవీనగరం, ఈబీసీకాలనీ ప్రజలు అడ్డుకున్నారు. సెల్‌టవర్ ఏర్పాటుకు పొక్లెయిన్‌తో గుంత తవ్వకం చేపట్టగా శనివారం సాయంత్రం ప్రజలు అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితులకు పరామర్శ

పిఠాపురం, న్యూస్‌టుడే: పి.దొంతమూరులో అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని గ్రామ తెదేపా నేతలు శనివారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వర్మాస్ కావ్య ఫౌండేషన్ నుంచి రూ.5000 అందజేశారు.

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం

కరప, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తోందని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. ఉప్పలంకలో శనివారం ఆమె మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులతో కలిసి 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం చేపట్టి సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందించారు. నాయకులు సత్యనారాయణమూర్తి, శ్రీనివాసబాబా, వెంకటేశ్వరరావు, ఇమ్మానుయేల్, జయేంద్రబాబు, రాంబాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

● **పిఠాపురం:** తెదేపాతోనే అన్నివర్గాలకు సంక్షేమం సాధ్యమవుతుందని కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు అన్నారు. శనివారం పి.తిమ్మాపురంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు అందజేశారు. అప్పన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో కరపత్రాలు పంచుతున్న అప్పారావు తదితరులు

ఉప్పలంకలో పర్యటిస్తున్న అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ పట్టణం, మెహర్ నగర్, డో.నెం.65-11-11రు కాపురస్తులు పిల్లి (లేటు) సత్యం గారి కుమారుడు పిల్లి సత్య రమేష్ గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి ఇవ్వుచున్న పబ్లిక్ నోటీసు.

రమణయ్యపేట పంచాయితీ / గ్రామం తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా LP నెం.47/87రు నందలి ప్లాట్ నెం.21రు దాఖలా 267 చ.గల స్థలమును పాలిక వెంకటరావు వగైరాల వద్ద నుండి కొనన జోగారావు గారు ది.21-01-1988 తేదీన కాకినాడ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.419/1988రు గా రిజిస్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొంది, దరిమిలా సదరు స్థలమును చుండ్రు వీర రఘు రాజనారాయణ గారికి ది.02-12-2002 తేదీగల ద.నెం.8985/2002రు గా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా విక్రయించి యున్నారు. దరిమిలా చుండ్రు వీర రఘు రాజనారాయణ గారు సదరు ఆస్తిని కాకినాడ కాపురస్తులు తాళ్ళూరి ఉషా రాణి గారికి విక్రయించి వారి పేరిట ది.01-02-2005 తేదీన స్వాధీన అగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును వ్రాయించి కాకినాడ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.1143/2005రు గా రిజిష్టర్ చేయించి యున్నారు.

సదరు తాళ్ళూరి ఉషా రాణి గారి వద్ద నుండి మా క్లయింట్ సదరు ఆస్తిని క్రయం పొందుటకు ఏర్పరచుకొని యున్నారు. కాగా ది.21-01-1988 తేదీన కాకినాడ రిజిష్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.419/1988రు గా రిజిష్టర్ కాబడిన కొనన జోగారావు గారి పేరిట గల క్రయదస్తావేజు ఒరిజినల్ తాళ్ళూరి ఉషారాణి గారి వద్ద పోయినది, సదరు విషయమై తాళ్ళూరి ఉషారాణి గారు III-టౌన్ PS నందు ఫిర్యాదు చేయగా, తమ పరిశోధనలో సదరు ఒరిజినల్ క్రయదస్తావేజు తిరిగి లభించి ఉండలేదని III-టౌన్ PS వారు ది.28-08-2026 వ తేదీన ధృవీకరించి యున్నారు.

కావున పై విషయమై అనగా పైన పేర్కొన్న ది.21-01-1988 తేదీన కాకినాడ రిజిష్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.419/1988రు గా రిజిష్టర్ కాబడిన క్రయ దస్తావేజు ఒరిజినల్ లేకపోవుట పట్లనూ, తాళ్ళూరి ఉషారాణి గారికి షెడ్యూల్ ఆస్తి యందు గల హక్కుల పట్లనూ ఎవరికి ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ, ఈ నోటీసు ప్రచురణ తేదీ లగాయతు 7 రోజులు లోగా మాకు తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేని యెడల మా క్లయింటు సదరు ఆస్తిని నిర్వివాద, నిష్పేచీ ఆస్తిగా భావించి బ్యాంకులు మరియు ఇతర ఆర్థిక సంస్థల వద్ద నుండి ఋణ సహాయం పొంది తన పేరిట గాని, తన వారి పేరిట గాని క్రయం పొందెదరు. తదుపరి ఎట్టి క్లైయిములు మా క్లయింటును బైండు చేయజాలవు. సదరు ఆస్తి పట్ల చెల్లనేరవు.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట గ్రామం / పంచాయితీ, స.నెం.188/6రు నందు LP నెం.47/87రు దాఖలా ప్లాట్ నెం.21రు గల 267 చ.గల ఖాళీ స్థలముకు హద్దులు కొలతలు వివరం. **తూర్పు:** 40' లేఅవుట్ ప్లాన్ దాఖలా 33 అ.ల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** 60' ప్లాట్ నెం.22రు స్థలం, **పడమర:** 40' ప్లాట్ నెం.14రు స్థలం, **ఉత్తరం:** 60' ప్లాట్ నెం.20రు స్థలం. సదరు హద్దుల మధ్యస్థమైన 267 చ.గల స్థలము అందలి సర్వం సహా.

Pepakayala Ramakrishna,
Mallipudi Satyanarayana, Magapu Chaitanya Kumar.
Advocates, Meher Bhavan, Ramaraopet, Kakinada – 533004. Ph: 94401 78750.
Place: Kakinada
Date: 29-08-2026

గంగాధర్‌కు తెదేపా నాయకుల నివాళి

తాళ్లరేవు: పటవలకు చెందిన తెదేపా నేత, ఎంపీపీ రాయుడు సునీత భర్త గంగాధర్(49) మృతిచెందారు. ప్రజల సందర్శనకు మృతదేహాన్ని శనివారం ఉదయం స్వగ్రామానికి తీసుకొచ్చారు. సునీతను పలువురు పరామర్శించారు. నాయకులు సాయి, లక్ష్మణరావు, వెంకటరమణ గంగాధర్ మృతికి నివాళి అర్పించారు.

చేపల మృతితో రైతు ఆవేదన

కరప: రెండు రోజుల్లో ఏసీడీ బిల్లు చెల్లిస్తానని చెప్పినా.. విద్యుత్తుశాఖ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో తన చెరువుల్లో చేపలు ఆక్సిజన్ అందక మృతిచెందాయని కొంగోడుకు చెందిన ఆక్వా రైతు వి.నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం కాలువలో మృతదేహం

గొల్లప్రోలు: కొడవలి శివారు ఇందేసమ్మగుడి సమీపంలోని పోలవరం కాలువలో గుర్తుతెలియని 30 నుంచి 35 ఏళ్ల వయసు వ్యక్తి మృతదేహం శనివారం కనిపించిందని ఎస్సై రామకృష్ణ తెలిపారు. వీఆర్వో పద్మశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు

బిల్లులు చెల్లించాలని నిరసన

కొత్తపల్లి: అభివృద్ధి పనులు చేశాం. బిల్లులు ఇవ్వండని అడిగితే.. పంచాయతీ అధికారులు లంచం అడుగుతున్నారని శనివారం మాజీ సర్పంచి గౌరీ రాజేశ్వరి, నాయకుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు, గుత్తేదారులు నాగులాపల్లి సచివాలయం ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ ఎంపీడీవో ఫోన్ ద్వారా రెండు రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. చిరంజీవికుమార్, నీలారెడ్డి, రామచంద్రారెడ్డి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: గురజనాపల్లి శివారు అడవిపూడి ప్రాథమిక పాఠశాల వెనక వీధిలో విద్యుద్దీపాలు సరిగా వెలగడం లేదు. **- గోవిందు**

పరిష్కారం: ప్రత్యేకాధికారి వెంకటశ్రీనివాసరావుకు చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కరప

సమస్య: పిఠాపురం పక్షులమర్రి చెట్టు ప్రాంతంలో మురుగు కాలువలు పూడిక నిండి ఉన్నాయి. దుర్వాసన వస్తోంది. **- నానిబాబు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా కార్మికులతో కాలువలు శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: గొల్లప్రోలు కరణంగారితోట వీధిలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. **- స్థానికులు**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: తాడితోటలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. చర్యలు చేపట్టాలి. **- రాజు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు చెప్పగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కొత్తపల్లి పంచాయతీ రవీంద్రపురంలో రహదారి వెంట చెత్త పేరుకుపోయి కుళ్లి దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపించి చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

మురుగు కదిలేలా పనులు

స్పందనకు వందనం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మార్కెట్‌లోని కాలువలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించే పనులు కార్మికులు శనివారం నిర్వహించారు. ఈ నెల 26న 'ఈనాడు'లో కాలువ మూత.. తప్పని వెత శీర్షికతో వచ్చిన చిత్ర కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య అధికారి రఘుప్రసాద్ పర్యవేక్షించారు.

మహిళలు.. జనహితులు

గొల్లప్రోలు: ఎ.కె.మల్లవరం ఎస్సీపేటలో నాచుపట్టి అపరిశుభ్రంగా ఉన్న జీఎల్ఆర్ ట్యాంకును స్థానిక మహిళలు శనివారం శుభ్రపరిచారు. డ్రెయిన్‌లో పూడిక, మొక్కలు పేరుకుపోవడంతో పనులు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

గుణాత్మక విద్యతో ప్రయోజనం

సామర్లకోట గ్రామీణం: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం పూర్తిస్థాయిలో వచ్చినప్పుడే ఉపాధ్యాయుల కర్తవ్యం నెరవేరుతుందని ఎంఈవో పుల్లయ్య అన్నారు. వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు గుణాత్మక విద్య ప్రయోజనం అందిస్తోందన్నారు.

6న కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: ఇంజరంలో కె.వి.ఆర్.అంజలి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో వచ్చే నెల 6న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకరపర్తి వెంకట్రావు, పూర్ణిమ దంపతులు శనివారం తెలిపారు.

సామర్లకోటలో కవుల వేషధారణలో చిన్నారులు

పిఠాపురంలో ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కరపలో క్రీడా దుస్తుల పంపిణీ

విద్యాలయాల్లో ఉత్సవాలు

సామర్లకోట: పాఠశాలల్లో శనివారం జాతీయ క్రీడా, తెలుగు భాషాదినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సామర్లకోట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బచ్చు ఫౌండేషన్, ప్రతిభ, భాష్యం పాఠశాలల్లో చిన్నారులు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ● **పిఠాపురం:** పిఠాపురం భాష్యం పాఠశాలలో విద్యార్థులు వేషధారణల్లో అలరించారు. ఈస్ట్-4 జడ్ ఈవో వేణు, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు. ● **పెద్దాపురం:** మహారాణి కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, ఏసుబాబు, జ్యోతిబా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సత్యం, సురేష్, మణికంఠ, రాజు, సంతోష్, సాయి పాల్గొన్నారు.

● **కరప:** ఎంఈవో సత్యనారాయణ కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి చిత్రపటాలకు ఏఎంసీ ఛైర్మన్ వెంకటరమణతో కలిసి పూలమాలలు వేశారు. పోలిశెట్టి నారయ్య అభ్యర్థనతో విశ్రాంత ఉద్యోగి వెలుగుబంట్ల గోపాలకృష్ణ రూ.10 వేలతో క్రీడాకారులకు దుస్తులు అందించారు. ● **పెద్దాపురం:** కాండ్రకోట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది క్రీడాకారులకు శనివారం గ్రామస్థుడు బి.నాగేశ్వరరావు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం ఉదయశ్రీ, శేఖర్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రమణయ్యపేట (కరప): కాకినాడ అక్నూ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపల్ ప్రశాంతి గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్‌లకు నివాళి అర్పించారు. పీడీ డా.రామ్‌గోపాల్, డా.సత్యనారాయణ, డా.హరనాథ్‌రాజా, నమశ్శివాయ, ధనరాజు పాల్గొన్నారు.

● **గొల్లప్రోలు:** గొల్లప్రోలు మాధురి విద్యాలయంలో విద్యాసంస్థల అధినేత తమ్మయ్యనాయుడు నివాళి అర్పించారు. జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో వేడుకలు జరిపారు.

అక్నూలో చిత్రపటాలకు పూలమాలలు వేసిన ఆచార్యులు

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం పాపారావు, రత్నగిరి, దెబోరా, పార్వతి పాల్గొన్నారు.

పంచాయతీ స్థాయిలో అభ్యంతరాల పరిశీలన

న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట గ్రామీణం

స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో వారంతా ఎవరి పనుల్లో వారు తలమునకలై ఉన్నారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లు, తప్పిదాల సవరణ చేపట్టి, పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించారు. పంచాయతీల స్థాయిలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి మార్పులు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

● ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలను తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై పరిశీలించి, మార్పుచేర్పులు చేసి జిల్లా స్థాయి అధికారులకు పంపిస్తారు. వాటిని కలెక్టర్ ఆమోదించిన తర్వాత ఈ నెల 31న తుది జాబితాను విడుదల చేయనున్నారు. నియోజకవర్గంలోని పెద్దాపురం మండలంలో 254 పోలింగ్ కేంద్రాలు ఉండగా తూర్పుపాకలు గ్రామంలోని పంచాయతీ కేంద్రంలో నిర్వహించే 1, 2 నంబరు పోలింగ్ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలోకి మార్పు చేశారు. మిగిలిన కేంద్రాలు యథావిధిగా ఉంటాయి. సామర్లకోట మండలం పనసపాడులోని తుపాన్ పునరావాస కేంద్రంలో ఉండే 235 నంబరు కేంద్రాన్ని గ్రామ సచివాలయంలోకి, వీకే రాయపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఉండే 172 కేంద్రాన్ని కొత్తూరులోని ప్రాథమిక పాఠశాలలోకి మార్పుచేశారు. మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉండే 177 పోలింగ్ కేంద్రాన్ని సచివాలయం-2లోకి మార్పు చేశారు.

సామర్లకోటలో బీఎల్‌వోలతో సమావేశం

మండలం	పంచాయతీలు	వార్డులు	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
పెద్దాపురం	23	254	41,740	254
సామర్లకోట	18	208	71,067	208

అభ్యంతరాలు తెలపాలని కోరాం..

పోలింగ్ కేంద్రాల మార్పుపై గ్రామాల్లో అభ్యంతరాలు తెలపాలని దండోరా వేయించాం. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి మార్పులుచేసి కలెక్టర్‌కు పంపిస్తున్నాం. పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఈ నెల 31న విడుదల చేస్తాం.

- సూర్యనారాయణ, హిమమహేశ్వరి, ఎంపీడీవోలు



(c) eenadu

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

మారుమూల ప్రాంతాల్లోనూ సేవలు : జేసీ

గిన్నెలారంలో గిరిజనులతో జేసీ, అధికారులు

రౌతులపూడి, న్యూస్‌టుడే: కొండలు, మారుమూల ప్రాంతాల్లోనూ సమాచార వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామని జేసీ అపూర్వ భరత్ అన్నారు. ఉపప్రణాళిక ప్రాంతమైన గిన్నెలారం గ్రామంలో అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు సంబంధించిన రెండు స్థలాలను పరిశీలించారు. గ్రామాల్లో అంతరాయం లేకుండా మొబైల్ నెట్‌వర్క్‌ను విస్తరించి వందశాతం కనెక్టివిటీ సాధించడమే లక్ష్యమన్నారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి చేరుకునేందుకు మార్గాన్ని ఏర్పాటుచేయాలని, ఆశా వర్కర్‌ను నియమించాలని, తాగునీటి బోరు సదుపాయం కావాలని స్థానికులు తెలియజేశారు. రహదారి పనులు టెండర్ దశలో ఉన్నాయని సిబ్బంది జేసీకి వివరించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణకుమారి, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజాదర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం

జగ్గంపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజల దీర్ఘకాలిక సమస్యలను సైతం తక్షణం పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. రావులమ్మనగర్‌లో క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రాలు అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరు సెప్టెంబరులో పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలని అక్టోబరు నుంచి వారికి పింఛన్లు అందిస్తామన్నారు. కొత్త కొండబాబు, పాటంశెట్టి కొండరాజులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తిరుచ్చిపై ఆశీనులను చేసి ఆలయ ప్రాకారం చుట్టూ ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు. దేవస్థానంలో రద్దీ నెలకొంది. నూతన వధూవరులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వ్రతమాచరించి, స్వామిని దర్శించుకున్నారు.

తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లు

సమయం మించింది.. వరిసాగు తగ్గింది

న్యూస్‌టుడే, తుని గ్రామీణం, తొండంగి

▲ తుని వ్యవసాయ సబ్ డివిజన్‌లో తీరు

ఈ ఏడాది వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాత ఆశలు ఆవిరయ్యాయి. మెట్ట ప్రాంత మండలాల్లో కరవు మేఘాలు అలుముకుంటున్నాయి. కేవలం బోరుబావులు ఉన్న పొలాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. భూగర్భజలాల పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో చివరి వరకు సాగునీరు అందుతుందా అనే ప్రశ్న రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఇదే పరిస్థితుల్లో మాగాణి పంటలకు సాగు నీటి కొరత వెంటాడుతుండడంతో పలు ప్రాంతాల్లో ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.

● తుని సబ్‌డివిజన్‌లో సాగు విస్తీర్ణం 37,658 ఎకరాలకు కేవలం 6,145 ఎకరాల్లో సాగు

● తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల పరిధిలో వరి సాధారణ విస్తీర్ణం సుమారు 37,658 ఎకరాలు కాగా ప్రస్తుతం కేవలం 6,145 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. మిగిలిన విస్తీర్ణం నేటి వరకూ బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. కొందరు రైతులు కూరగాయ పంటలు వేసినప్పటికీ సాగునీటి కొరత కారణంగా ఎండిపోతున్నాయి.

మండలాల వారీగా వరి సాగు ఇలా.. (ఎకరాల్లో)

మండలం	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుత సాగు
తుని	7,304	455
తొండంగి	12,797	3,050
కోటనందూరు	10,200	1,809
రౌతులపూడి	5,060	665
శంఖవరం	2,297	166
మొత్తం	37,658	6,145

హంసవరం పరిధిలో అడుగంటిన కేఎంఆర్ ట్యాంకు

వెలవెలబోతున్న చెరువులు

మెట్టప్రాంత మండలాల్లో ఖరీఫ్‌లో సాగు మొత్తం వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. ఈయేడు వరుణుడు జాడ కనిపించకపోవడంతో చెరువులు వెలవెలబోతున్నాయి. సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే మండలంలోని హంసవరం కేఎంఆర్ ట్యాంకు నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఆయకట్టు రైతులు పంట సాగు చేసే పరిస్థితి కానరావడం లేదు. డి.పోలవరం, తిమ్మాపురం, ఎన్ఎస్వీ నగరం, దొండవాక చెరువులు పూర్తిగా ఎండిపోయి చుక్కనీరు లేదు. పశువులకు సైతం తాగునీరు దొరకని దుస్థితి.

ఆరుతడి పంటలు వేయాలి

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచిస్తున్నాం. కొన్ని రకాల ఆరుతడి విత్తనాలు రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. వరిసాగు రైతులు తప్పని సరిగా పంటబీమా చేయించుకోవాలని సూచిస్తున్నాం. - చంద్రశేఖర్, ఏడీ, తుని వ్యవసాయ సబ్ డివిజన్

ప్రొటోకాల్ ఉల్లంఘించారని ఫిర్యాదు

కాకినాడ కలెక్టరేట్: ఏలేశ్వరం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘించారని అధికారులపై ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో డాక్టర్ డీటీ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏఐపై కార్యశాల

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏజెంటిక్ ఏఐపై కార్యశాల నిర్వహించినట్లు చైర్మన్ కృష్ణారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఆధునిక టెక్నాలజీ, భవిష్యత్తు అవకాశాలకు ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు.

మురుగు శుభ్రం చేశారు

కోటనందూరు: 'మురుగుతో అవస్థలు' శీర్షికన ఈనెల 28న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ప్రధాన రహదారిపై ఇరువైపులా మురుగు నిలిచిపోవడంపై ఎంపీడీవో పి.వెంకటనారాయణ చర్యలు చేపట్టారు. సిబ్బందితో మురుగును శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని 132 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో ఆదివారం నిర్వహణ పనులు జరుగుతాయని ఈఈ వీరభద్రరావు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏలేశ్వరం, పెద్దనాపల్లి, రమణయ్యపేట, సి.రాయవరం, జె.అన్నవరం, లింగంపర్తి, భద్రవరం, పేరవరం, తూర్పులక్ష్మీపురం గ్రామల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లోనూ విద్యుత్తు సరఫరాకు పై సమయంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సీఎంను కలిసిన ప్రత్తిపాడు తెదేపా నాయకులు

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం), న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు మంగళగిరిలో యూనిట్ ఇన్‌ఛార్జుల శిక్షణకు నియోజకవర్గంలోని మండలాల నుంచి పలువురు తరలివెళ్లారు. ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డి సాగర్ ఛైర్మన్‌గా పనిచేస్తున్న ఇళ్ల అప్పారావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు అడ్డాల త్రిమూర్తులు శనివారం యూనిట్ ఇన్‌ఛార్జుల హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

జగ్గంపేట గ్రామీణం, కోటనందూరు, తొండంగి: తెలుగు భాష ఔన్నత్యాన్ని రానున్న తరాలకు అందించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ప్రిన్సిపల్ డా. డి.చెన్నారావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి తీయదనాన్ని సామాన్యుడికి అందించేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు ఎనలేని కృషి చేశారన్నారు. ● కోటనందూరు, తొండంగి మండలంలోని పాఠశాలల్లో భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు డిప్యూటీ ప్రోఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ● తాళ్లూరు ఉన్నత పాఠశాలలో క్రీడాదినోత్సవం ,తెలుగుభాషా దినోత్సవం నిర్వహిచినట్లు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. ● తుని పట్టణంలోని ఆర్ఎస్‌పేటలోని భాష్యం స్కూల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రిన్సిపల్ రంగబాబు బహుమతులు అందజేశారు.

ఏలేశ్వరం: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ చైతన్య స్కూల్‌లో పలు కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడే రీతిలో వస్త్రధారణతో పాఠశాలకు వచ్చారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ప్రిన్సిపల్ రమణ, డీఎస్ కృష్ణ, ఉపాధ్యాయుడు అర్జున్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాలుగో తరగతి విద్యార్థిని పాబోలు శ్రీ హంసిక తెలుగు తల్లి వేషధారణలో వచ్చి తన ప్రసంగంతో అలరించారు.

తుని గ్రామీణం, రౌతులపూడి: వి.కొత్తూరు కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం తెలుగుభాషా, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు పద్యపఠనం పోటీలు నిర్వహించారు. పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపల్ అమృతవాణి బహుమతులు అందించారు. ● రౌతులపూడి కేవీ ప్రాథమిక పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

తొండంగి: చిత్రపటాలకు నమస్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లూరు ఉన్నత పాఠశాలలో..

ఏలేశ్వరం శ్రీ చైతన్యలో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి: యనమల

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో అన్ని కోణాల్లో పరిశీలించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ జాబితాలో జనసేన, భాజపాలకు తగిన ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.. విపక్షాలు అరాచకాలు సృష్టిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని యనమల స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం విజయం సాధిస్తుందన్నారు. నాయకులు యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మల్ల గణేష్, మోతుకూరి వెంకటేష్, సూరంపూడి చంద్రశేఖర్, కుక్కడపు బాలాజీ, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బెండపూడి వద్ద పోలవరం కాలువ కోసం నిర్మించిన రెండో వంతెన

రెండో వంతెనపై రాకపోకలు ప్రారంభం

కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం ఎడమ కాలువ పనులు చకచకా సాగుతున్నాయి. దీనిలో భాగంగా 16 వ నంబరు జాతీయ రహదారిపై బెండపూడి వద్ద రెండో వంతెన నిర్మాణం ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో ఈ వంతెనపై వాహనాలు రయ్..రయ్‌మంటూ తిరుగుతూ శనివారం కనిపించాయి. - న్యూస్‌టుడే, తొండంగి

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..?

జాతీయ రహదారిపై నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నా పలువురు వాహనదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. నిత్యం పట్టణంలోని కొట్టాం సెంటర్, డ్రైవర్స్ కాలనీ జంక్షన్‌తోపాటు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్‌పై భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వీటిని గమనించకుండా ద్విచక్ర, ఆటో, కార్లలో వచ్చిన వారు వేగంగా ఢీకొని కొందరు మృత్యువాత పడగా, ఇంకొందరు క్షతగాత్రులవుతున్నారు. పోలీస్, హైవే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జేఈ రాంజీరావు

జగ్గంపేట గ్రామీణం: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో ఏవీయస్ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ కోరిపల్లి నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా సమీక్ష జరిపి ప్రగతి నివేదికను సమర్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాంజీరావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని గ్రామాల్లో నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పలుశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

లంపకలోవ పాఠశాలలో లాంగ్‌జంప్ పోటీ..

ప్రత్తిపాడు (ఏలేశ్వరం), తొండంగి, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలోని లంపకలోవ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణిప్రభ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం జరిగింది. విద్యార్థిని, విద్యార్థులు పలు ప్రదర్శనలు, ఆటల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని హెచ్ఎం పేర్కొన్నారు. ఆటల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఉపాధ్యాయులు గణపతి, నరేష్, ఆదిలక్ష్మి, కె.ఉమ పాల్గొన్నారు. ● పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ధనుంజయరెడ్డి, అధ్యాపకులు శ్రీను,కృష్ణ, తదతరులు క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

కిర్లంపూడి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులు మాజీ మంత్రి స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి నివాళులు అర్పించారు. కిర్లంపూడి క్రీడామైదానంలో అంతర్జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి విభాగాల్లో రాణిస్తున్న క్రీడాకారులు, మాజీ క్రీడాకారులు, అక్కడికి చేరుకుని ముద్రగడ మృతికి సంతాపం ప్రకటించారు. మాజీ క్రీడాకారుడు, మాజీ సర్పంచి పెంటకోట నాగబాబు, కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎస్ఎస్ రామ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగి మూర్తి, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు నైదాన రఘు, దాడి పెద్దబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మందులు అందజేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ మణి, తెదేపా నాయకులు

పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం), న్యూస్‌టుడే: పశు సంతతిని వృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిచ్చి నిధులు వెచ్చిస్తున్నాయని ప్రత్తిపాడు ఏఎంసీ ఛైర్మన్ బద్ది మణి అన్నారు. ఏలూరులో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని శనివారం శాఖ ఉప సంచాలకులు యోగేశ్వర్ తదితరులతో కలిసి ఆమె ప్రారంభించారు. వెటర్నరీ వైద్యాధికారి సతీష్‌కుమార్ శిబిరంలో పశువులకు సేవలు అందించారు. పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని చెప్పారు. తెదేపా నాయకులు బద్ది రామారావు, అడ్డాల త్రిమూర్తులు, ఆర్.సత్యనారాయణ, పాసిలి అప్పారావు, ఏఎంసీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పశువుల్లో వ్యాధి నివారణకు ఉపకరించే ఔషధాలను అందజేశారు.

పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

గంజాయి విక్రయాలు అరికట్టాలని నిరసన

జగ్గంపేట గ్రామీణం: గంజాయి, నాటుసారా విక్రయాలను అరికట్టాలంటూ మహిళలు జగ్గంపేట పోలీసుస్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. చిన్నపిల్లలు సైతం గంజాయికి అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. రామవరం శివారు యానాదుల కాలనీలో కొంత మంది గంజాయి యథేచ్ఛగా విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడంలేదంటూ వాపోతున్నారు. కాలనీలో మద్రి చంద్రశేఖర్, రమణమ్మ, రాజులమ్మ అను వారు విక్రయాలు చేస్తున్నారని కాలనీకి చెందిన పలువురు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రఘునాథరావు మాట్లాడుతూ.. గంజాయి, సారా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

ప్రత్తిపాడులో అంబేడ్కర్‌కు పూలమాల వేస్తున్న శ్రీను

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం), న్యూస్‌టుడే: రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పాటు దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి శనివారం పలువురు పూలమాలలు వేశారు. కమిటీ ఛైర్మన్‌గా బీఆర్ అంబేడ్కర్‌ను నియమించిన క్రమంలో ఆయనకు నివాళులు అర్పించారు. దేశ రాజ్యాంగం రూపకల్పనకు శ్రీకారం చుట్టిన ఈ రోజు ఎంతో విశిష్టమైందని పీసీసీ సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధరణాలకోట శ్రీను అన్నారు. కందిమళ్ల శామ్యూల్, నూకరాజు, కాకర ప్రకాష్ పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసలు

ఎస్పీ బిందుమాధవ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై టి.రామకృష్ణ

కోటనందూరు, న్యూస్‌టుడే: నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళ అదృశ్యం కేసును ఛేదించిన కోటనందూరు పోలీసులకు శనివారం ఎస్పీ బిందు మాధవ్ అభినందనలు తెలిపారు. రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సీతాదేవి అనే మహిళ అదృశ్యంపై నాలుగేళ్ల కిందట కేసు నమోదైంది. ఇటీవల పోలీసులు ఆమె ఆచూకీని కనుగొని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆర్‌టీజీఎస్ కెమెరా వ్యవస్థ, కాల్ వివరాలు, ఇతర ఆధారాలను ఉపయోగించి పెండింగ్‌లో ఉన్న కేసును పట్టుదలతో దర్యాప్తు చేసినందుకు ఎస్సై టి.రామకృష్ణకు ఎస్పీ ప్రశంసాపత్రాన్ని అందించి, అభినందించారు.

తుని:ఆసుపత్రి ప్రాంగణంలో నినాదాలు చేస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలి

తుని, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బంది విజ్ఞప్తి శనివారం చేశారు. ఆసుపత్రిలో విధులకు ఆటంకం లేకుండా శాంతియుతంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. తమ ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని నినాదాలు చేశారు. దుర్గాభవానీ, శేషరత్నం, కృష్ణవేణి, సీత, సుజాత, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు

• పీఎంశ్రీ పాఠశాలల్లో చర్యలు

న్యూస్‌టుడే, తొండంగి, కోటనందూరు:

'పది' విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. 'మిషన్ మార్చి' పేరిట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరగతులు ప్రారంభమయ్యాయి. రోజుకో పాఠ్యాంశాన్ని బోధిస్తూ వాటిపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ఇక్కడ బోధన అందేలా కృషి చేస్తోంది ఇప్పటికే ఈ జిల్లా నుంచి కొందరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఫిన్‌లాండ్ పర్యటనకు పంపింది. వీరు అక్కడ విద్యావ్యవస్థను క్షుణ్నంగా పరిశీలించి ఆ రీతిలో ఇక్కడ బోధన అందేలా ప్రభుత్వానికి నివేదిక అందివ్వనున్నారు. ప్రభుత్వ బడుల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చేరికలు పెరిగే అవకాశం ఉంది.

షైనింగ్, రైజింగ్ స్టార్లుగా విభజన

తుని నియోజకవర్గంలోని తొండంగి, కోటనందూరు, తుని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'పది' చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు 40 శాతం షైనింగ్, 60 శాతం రైజింగ్ స్టార్లుగా విభజించారు. దీంతో వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మిషన్ మార్చి తరగతులు జులై 13 నుంచి ప్రారంభమయ్యాయి. ఇవి నవంబరు 30 తో ముగుస్తాయి. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గంట పాటు ఈ తరగతులు నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వీరికి రెమిడియల్ తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నీ లీప్ యాప్‌లో పొందుపరుస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తొండంగి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

'పది' విద్యార్థులకు నిర్వహించే ఈ ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షలపై విద్యార్థుల్లో భయం తొలగి పాఠ్యాంశాలపై పట్టు సాధించి భవితకు మార్గం ఏర్పరుచుకునే అవకాశం ఉంటుంది.
- చాట్రాతి సత్యనారాయణ, కొట్టు సత్యనారాయణ, హెచ్ఎంలు, తొండంగి మండలం.

పట్టపగలే చోరీ

బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగిలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ.. గ్రామానికి చెందిన గాతాడి చిన్న, శైలు దంపతులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. యథావిధిగా శనివారం ఉదయం ఇంటికి తాళాలు వేసుకుని పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి, బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అందులో చూసేసరికి బీరువాలో ఉంచిన 15 గ్రాముల బంగారం (చెవిదిద్దులు ఒక జత, చెవిలీలు ఒకజత, సుమారు. రూ.2.50 లక్షలు) రూ.3,500 నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో దంపతులు పోలీసులను ఆశ్రయించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నామని ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.

(c) eenadu